

సాక్షి సిద్దిపేట



రేపటికి ముందడుగు





స్వతంత్రమే ముద్దు.. ఆకాశమే హద్దు

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళామణులు


- స్వతంత్రంగా జీవించాలని కోరుకుంటున్నవారే అధికం
- ఆడ–మగ వివక్ష లేని సమాజమే ముఖ్యం
- ఆత్మవిశ్వాసంతో ముందడుగు..
- 'సాక్షి' సర్వేలో పలువురు మహిళలు, విద్యార్థినుల అభిప్రాయాలు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: అన్ని రంగాల్లో ముందుంటున్న మహిళల ఆలోచన విధానం మారుతోంది. సాధికారత దిశగా వేగంగా దూసుకెళ్తున్నారు. ఉన్నత చదువులు అభ్యసిస్తున్న మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తున్నారు. ఎవరిపైనా ఆధారపడకుండా సొంతంగా నిర్ణయాలు తీసుకునే స్థాయికి ఎదుగుతున్నారు. తాము ఎంచుకున్న రంగాల్లో మగవారితో ఏమాత్రం తీసిపోని విధంగా ముందుకెళ్తున్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 'సాక్షి' ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రత్యేక సర్వే నిర్వహించింది. తమకు నచ్చిన రీతిలో స్వతంత్రంగా జీవించాలని కోరుకుంటున్న మహిళల సంఖ్య పెరుగుతోంది. 57 శాతం మంది మహిళలు, విద్యార్థినులు స్వతంత్రంగా జీవించాలగలుతున్నామని స్పష్టం చేశారు. చిన్నప్పుడే ఆడ–మగ వివక్షను ఎదుర్కొన్న వారు సుమారు 46 శాతం మంది ఉన్నారు. తమ చేతికి అధికారం వస్తే ఆడ–మగ వివక్ష లేని సమాజం ఏర్పాటుకు కృషి చేస్తామని చెప్పిన వారు మూడోవంతు ఉన్నారు. వచ్చే జన్మంటూ ఉంటే ఆడపిల్లలాగే పుట్టాలని 66 శాతం మంది కోరుకుంటున్నారు. సర్వేలో వెల్లడైన అభిప్రాయాలు ఈ విధంగా ఉన్నాయి.

సర్వే నిర్వహించిన ప్రాంతాలు : సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్, పటాన్‌చెరు, జహీరాబాద్, జోగిపేట్ పట్టణాల్లో కార్యాలయాలు, డిగ్రీ, ఇంజనీరింగ్ కాలేజీల్లో మహిళలు, విద్యార్థినులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

సేకరించిన శాంపిల్స్ : 160

మీకు నచ్చిన రీతిలో స్వతంత్రంగా జీవించగలుగుతున్నారా?



1. అవును : 92
2. లేదు : 41
3. కొంత మేర : 27


మీకే పూర్తి అధికారం ఉంటే.. మహిళల కోసం ఏం చేస్తారు?



1. ఆడ, మగ వివక్ష లేని సమాజాన్ని ఏర్పాటు చేయడం : 57
2. మహిళలపై హింస, ఇతర నేరాలపై కఠిన శిక్షలు అమలు : 51
3. ఆడపిల్లలకు ఉచిత విద్య, ఉద్యోగాల్లో 50 శాతం రిజర్వేషన్లు : 50
4. ఆడవాళ్లకు నెలలో 4 రోజులు పూర్తి సెలవు (నెలసరి) : 02

మహిళగా మీరు ఎక్కువగా ఇబ్బందిపడిన అంశం..

1. చిన్నప్పుడు ఇంట్లోనే ఆడ– మగ వివక్ష ఎదుర్కొన్నప్పుడు : 74
2. కాలేజీ– పనిప్రదేశం–ప్రయాణంలో వేధింపులు: 41
3. సోషల్ మీడియా టీజింగ్ : 45



మళ్లీ జన్మంటూ ఉంటే ఎలా పుట్టాలనుకుంటారు?

1. మళ్లీ ఆడపిల్ల లాగే : 106
2. మగ పిల్లాడిలా : 54



ఆత్మవిశ్వాసమే ముఖ్యం సాధికారతే లక్ష్యం

- ఇంతింతై.. విశ్వవ్యాప్తమై..
- ఇంటింటా 'మహాలక్ష్మి'యై..
- సమాజంలో మహిళల ముందడుగు..
- రాణిస్తున్న రమణులతో 'సాక్షి' టాక్ షో



సంగారెడ్డి టాక్ షోలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

సమాజంలో మహిళా సాధికారత రోజురోజుకు ముందడుగు పడుతోంది. ప్రస్తుత ప్రభుత్వాలు సైతం మహిళల అభ్యున్నతికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాయి. స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు మహిళలకు ప్రత్యేక స్థానం కల్పిస్తున్నాయి. సమాజంలో పెరుగుతున్న గౌరవం వారి ప్రతిభకు తార్కాణాలుగా నిలుస్తున్నాయి. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు రంగాల్లో రాణిస్తున్న మహిళలతో 'సాక్షి' టాక్ షో నిర్వహించింది. అలాగే ఒక్కరే కూతురున్న తల్లిదండ్రులనూ సైతం 'సాక్షి' పలకరించింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

– సంగారెడ్డి/సంగారెడ్డి అర్బన్

కొడుకైనా.. కూతురైనా ఈమెనే..

మాది పుల్కల్ మండలం కోడూరు గ్రామం. మాకు మొదటి సంతానం మహాలక్ష్మి లాంటి కూతురు జన్మించింది. రెండో సంతానం గురించి ఆలోచించలేదు. కొడుకైనా.. కూతురైనా ఈమనే అని భావించి బాగా చదివించాం. మా ఆశయాలకు తగ్గట్టే చదువులో రాణిస్తోంది. ప్రస్తుతం మా కూతురు మనీశా బీటెక్ సీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతోంది.

– మనీశా తల్లిదండ్రులు

ఉద్యోగం చేస్తుండటం గర్వంగా ఉంది



మాది పుల్కల్ మండలం బయన్నకోడూరు గ్రామం. మా ఇంట ఏకైక సంతానం కూతురే. కొడుకు కావాలన్న ఆలోచన లేకుండానే కూతురు రచనను మంచి చదువులు చదివించాం. ప్రస్తుతం ప్రముఖ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. మేము కన్న కలలు సాకారమయ్యాయి. కూతురైనా.. కొడుకైనా వివక్ష లేకుండా చూడాలని తల్లిదండ్రులు రెడ్డిగారి అరుణజ్యోతి, రాజేందర్ రెడ్డి అన్నారు.

వివక్ష వీడాలి



మహిళలు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు బాగా చదువుకోవాలి. చిన్నప్పుడు ఇంట్లో ఆడ, మగ వివక్షను తల్లిదండ్రులు వీడాలి. స్వతంత్రంగా జీవించడానికి మేము ఇష్టపడతాం. ఆడపిల్లగా పుట్టడం నా అదృష్టం.

– అంజలి, విద్యార్థి

స్వేచ్ఛగా బతకాలి



ప్రతి మహిళా స్వేచ్ఛగా బతకాలి. ఎలాంటి సమస్యలు ఎదురైనా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి. స్వాతంత్రం వచ్చి 77 ఏళ్లు దాటుతున్నా మహిళలు చీకటిపడితే ఒంటరిగా వెళ్లేందుకు జంకుతున్నారు. సమాజంలో మహిళలను ఇప్పటికీ కొంతమంది తక్కువ చూపుతో చూస్తున్నారు. ఇప్పటికీ దౌర్జన్యాలు కొనసాగుతునే ఉన్నాయి. వివక్ష చూపకుండా బాలికలను బాగా చదివించాలి.

– అరుణ బాయ్, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

సమాజంలో మార్పురావాలి

హుస్నాబాద్: 'సమాజంలో మార్పురావాలి.. ఆడ, మగ అనే వివక్ష వీడాలి. అక్షరాస్యత శాతం పెరగాలి.. అప్పుడే సమాజంలో రాణించేందుకు అవకాశం ఉంటుంది' అని విద్యార్థినులు అన్నా రు. హుస్నాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మహిళా సాధికారత, ఆడపిల్లలపై వివక్షతో పాటు పలు అంశాలపై గురువారం 'సాక్షి' టాక్ షో నిర్వహించింది. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సతీష్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు. 'సాక్షి' టాక్‌షోలో వెల్లడించిన వారి మనోగతాలు ఇవీ..



హుస్నాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థినులతో కలిసి కేక్‌కట్ చేస్తున్న అధ్యాపకులు

అమ్మ సహకారంతోనే..



మా అమ్మ సహకారంతోనే ఇంజనీరింగ్ చదువుతున్నాను. నాన్న డ్రైవర్. అమ్మ ఓ షాపులో పని చేస్తుంది. అమ్మానాన్నల ప్రోత్సాహంతో చదువుకుంటున్నాను. నా స్నేహితురాలికి చిన్న వయస్సులోనే వివాహం జరిపించడం.. వారి కష్టాలు నన్ను ప్రభావితం చేశాయి. బాగా చదివి లక్ష్యాన్ని చేరుకుంటాను.

– మడిపెల్లి అక్షయ, సివిల్ ఇంజనీరింగ్, ద్వితీయ సంవత్సరం

టీచర్స్‌కు గౌరవం ఇవ్వాలి..



కళాశాలలో ముందుగా టీచర్లకు గౌరవం ఇచ్చినట్లయితే అమ్మకు గౌరవించినట్లు. అమ్మాయిలు మంచిగా చదువుకున్నప్పుడే అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయి. అప్పుడే సమాజంలో మంచి గుర్తింపు వస్తుంది. ప్రతి విషయంలో కీలక పాత్ర పోషించే స్థాయికి ఎదగాలి. సాధికారత దిశగా అడుగులు వేయాలి.

– పూజా, సివిల్ ఇంజనీరింగ్, ద్వితీయ

బాల్య వివాహాలు వద్దు



పేద, మధ్య తరగతి కుటుంబాల్లో చాలా వరకు బాల్య వివాహాలు చేస్తున్నారు. అవగాహన లేకపోవడంతో ఎంతో మంది అమ్మాయిలు నష్టపోతున్నారు. అందుకే ప్రతి అమ్మాయి చదవాలి. అప్పుడే ఆర్థికంగా నిలబడుతారు. తద్వారా మహిళలపై ఉన్న వివక్షకు ఫుల్‌స్టాప్ పడుతుంది.

– లావణ్య, సివిల్ ఇంజనీరింగ్, ద్వితీయ

తేడా ఉండకూడదు



చాలా కుటుంబాల్లో ఆడ, మగ అనే తేడా చూపిస్తున్నారు. అమ్మాయిలు కళాశాలకు వెళ్లి కొద్దిగా ఆలస్యమైతే ఎందుకైందని అడుగుతారు. అదే అబ్బాయి ఎంత రాత్రి అయినా ఎవరూ అడగరు. ఈ వివక్ష పోవాలి. చదువుతోనే వివక్షను అధిగమించవచ్చు.

– హిమబిందు, సివిల్ ఇంజనీరింగ్, ద్వితీయ

అమ్మాయి చాలనుకున్నాం

కొడిపల్లి(నర్సాపూర్): ఒక అమ్మాయి చాలనుకొని ఉన్నత చదువులు చదివిస్తున్నామని మండలంలోని కంచన్‌పల్లికి చెందిన వెంకన్నగారి పద్మ, శ్రీనివాస్ పేర్కొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి'వారిని పలకరించగా పలు విషయాలు వెల్లడించారు. శ్రీనివాస్ గ్రామంలో వ్యవసాయం చేస్తుండగా ఆయన భార్య అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. ప్రస్తుతం వీరి కూతురు అతీక్షను అమెరికాలో ఎంటెక్ కంప్యూటర్ సైన్స్ చదివిస్తున్నారు. మొదట అమ్మాయి పుట్టడంతో ఆడ, మగ ఇద్దరు సమానమేనని ఒక్క అమ్మాయితోనే సరిపెట్టుకున్నాం. నిజామాబాద్‌లో పాఠశాల విద్య, హైదరాబాద్‌లో ఇంటర్మీడియెట్, బీటెక్ చేయించాం. బంధువుల సూచనలతో అమెరికాలో ఉన్నత విద్యకు పంపించాం.



అతీక్షకు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు



కూతురు సౌమ్యతో తల్లిదండ్రులు

ఆడ, మగ తేడా వద్దు

కొడిపల్లి(నర్సాపూర్): పుట్టే బిడ్డ ఆడ, మగ ఎవరైనా ఒక్కరే చాలనుకున్నాం. ఆడపిల్ల పుట్టడంతో లక్ష్మీదేవి పుట్టిందని సంబురపడ్డామని కొడిపల్లి మండలం రాయిలాపూర్ సెక్టార్ సూపర్‌వైజర్ లక్ష్మి, శ్రీనివాస్ దంపతులు చెప్పారు. వెల్దుర్తి మండలం అందుగులపల్లికి తండాకు చెందిన వీరికి కూతురు సౌమ్య ఉంది. ప్రస్తుతం అమ్మాయి తొమ్మిదో తరగతి చదువుతోంది. శ్రీనివాస్ తండాలో వ్యవసాయం, పట్టు పురుగుల పెంపకం చేస్తుండగా.. లక్ష్మి ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. మా తల్లిదండ్రులు మారుమూల తండాలో ఉండి నన్ను చదివించారు కాబట్టే ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నా. అమ్మాయి పుట్టగానే చాలనుకున్నాం.. సంతోషంగా పెంచుతున్నామని దంపతులు పేర్కొన్నారు.

ఇంకా చిన్న చూపేనా?

నర్సాపూర్‌రూరల్: మహిళలు అంతరిక్షంలో అడుగుపెట్టినా నేటికీ వివక్షకు గురికాక తప్పడం లేదని అసిస్టెంట్ ప్రొఫెసర్ రుక్మిణి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'ఆడపిల్లలపై వివక్ష'అనే అంశంపై 'సాక్షి'టాక్ షో నిర్వహించగా విద్యార్థినులు, అధ్యాపకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈసందర్భంగా రుక్మిణి మాట్లాడుతూ.. నేటికీ మనదేశంలో మహిళా బిల్లు ఆమోదానికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో ఆడపిల్లల వివక్షతపై తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మహిళల భద్రత, స్వేచ్ఛ, సమాన హక్కుల కోసం మార్పులు తీసుకొచ్చి కొత్త చట్టాలు అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని అన్నారు.



టాక్ షోలో పాల్గొన్న నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు

పెళ్లికి ఒత్తిడి చేస్తున్నారు



చదువుకున్నది చాలులే పెళ్లి చేసుకోవాలని తరచూ కుటుంబ సభ్యులు అడుగుతున్నారు. నాకు మాత్రం ఉన్నత చదువులు చదివి ఉద్యోగం చేయాలని ఉంది. ఎంత చదివినా ఒక ఇంటికి వెళ్లాల్సిందే కదా పెద్ద చదువులు చదివితే పెళ్లి కొడుకు ఎక్కువ చదువుకున్నోడు కావాలి అంటున్నారు. పెద్ద మొత్తంలో కట్న కానుకలు ఇచ్చుకోలేమని చెబుతున్నారు.

–మమత, బీఏ ఫైనల్ ఇయర్

వివక్షతను పారదోలాలి



వివక్షతను తప్పుకోవాలంటే కష్టపడి చదువుకొని ఉన్నత ఉద్యోగాలు సాధించాలి. చదువు, ఉద్యోగం, రాజకీయ ఇతర రంగాల్లో రాణిస్తే మహిళపై జరుగుతున్న వివక్షతపై మనమే పోరాడాల్సిన ధైర్యం వస్తుంది. మొదటిగా మన కుటుంబం నుంచి వివక్షతను పారదోలాలి.

– సంధ్య, డిగ్రీ ఫైనల్ ఇయర్

మగ పిల్లలను గారాబం చేస్తారు



నాకు ఒక అన్న, తమ్ముడు ఉన్నారు. అమ్మానాన్న వారిని గారాబంగా చూస్తారు. చిన్నప్పటి నుంచి ఆట వస్తువులు, దుస్తులు, అడిగిన ప్రతి వస్తువు కొనిస్తారు. నేను అడిగితే మాత్రం ఆడపిల్లవి నీకెందుకు అని దాటవేస్తారు. వారిని ప్రైవేట్ పాఠశాల, కళాశాలలో చదివిస్తున్నారు. నేను మాత్రం చిన్నప్పటి నుంచి ప్రభుత్వ బడుల్లోనే చదువుతున్నాను.

–నందిని, బీజెడ్‌సీ, ఫస్ట్ ఇయర్

అందరినీ సమానంగా చూడాలి



కుటుంబంలో అమ్మాయి, అబ్బాయిని సమానంగా చూడాలి. అబ్బాయిలకు పని చెప్పకుండా అమ్మాయిలకే చెప్పడం మానుకోవాలి. అబ్బాయిలు లేటుగా లేసిన అమ్మాయిలు మాత్రం ఉదయమే లేచి ఇంటి పనులు చేయాలి. ఇంటర్, డిగ్రీ పూర్తికాగానే పెళ్లి చేయాలన్న ఆలోచన మానుకోవాలి. అమ్మాయిలను ప్రోత్సహిస్తే అన్నిరంగాల్లో రాణిస్తారు.

–దశమ్మ, అధ్యాపకురాలు

ఈ టీచరమ్మ ఆదర్శం

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని లక్ష్మీనగర్ పంచాయతీ మదిర గ్రామం ఆరెపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్న భాగ్యలక్ష్మి అందరి మన్ననలు పొందుతోంది. పాఠశాలలో ఏకోపాధ్యాయురాలిగా పనిచేస్తూనే గ్రామస్తుల సహకారంతో ముగ్గురు మహిళా వలంటీర్లను ఏర్పాటు చేసింది. ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు తెలుగు మీడియంతో పాటు ఇంగ్లీష్ మీడియంలో విద్యా బోధన చేస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతోంది. 2019లో ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీ పరీక్షల్లో పాఠశాలకు చెందిన 19 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయిలో బహుమతులు సాధించారు. 2020లో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన భాగ్యలక్ష్మి అప్పటి మంత్రి హరీశ్‌రావుతో ప్రశంసలు అందుకుంది. విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దడంలో అవిరళ కృషి చేస్తున్న భాగ్యలక్ష్మి ప్రతి ఒక్కరికి ఆదర్శంగా నిలుస్తోంది.



హరీశ్‌రావుతో ప్రశంసలు అందుకుంటున్న భాగ్యలక్ష్మి

నాలా డాక్టర్‌ను చేస్తా



సిద్దిపేటకమాన్: తన కూతురును భవిష్యత్‌లో తనలా డాక్టర్‌ను చేయాలన్నదే తన లక్ష్యమని చిన్న పిల్లల విభాగ వైద్యుడు డాక్టర్ భూపతి శేషుకుమార్ తెలిపారు. సిద్దిపేట పట్టణం భరత్‌నగర్‌కు చెందిన భూపతి శేషుకుమార్, బిందు దంపతులకు పాప సాన్వి(2) ఉంది. సమాజంలో ఆడామగ తేడా లేకుండా అందరూ సమానమే అనే విధంగా పెంచాలన్నారు. భవిష్యత్‌లో ఉత్తమ వైద్య సేవలు అందించేలా, మంచి వైద్యురాలిగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. శేషుకుమార్ పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చిన్న పిల్లల వైద్యుడిగా సేవలు అందిస్తున్నారు. బిందు అమెరికాలో ఎమ్ఎస్ పూర్తి చేసి ప్రస్తుతం ఆసుపత్రి నిర్వహణ బాధ్యతలు చూసుకుటుంది.

–డాక్టర్ శేషుకుమార్, చిన్నపిల్లల వైద్యుడు, సిద్దిపేట

అబ్బాయిలా పెంచుతున్నాం

సిద్దిపేటకమాన్: పట్టణంలోని కుషాల్‌నగర్‌లో మారెడ్డి మహేందర్‌రెడ్డి, విజయ దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి భువనకృతి పాప ఉంది. ఆమె ప్రస్తుం హైదరాబాద్‌లోని మల్లారెడ్డి కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతుంది. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఆ దంపతులు పేర్కొన్నారు. ఆడ, మగ అనే తేడా లేకుండా పిల్లలను పెంచాలని అంటున్నారు. మా కూతురిని కూడా అబ్బాయిలాగా పెంచుతున్నాం. ఆమె చాలా ధైర్యంగా ఉంటుంది. ఆడపిల్లలకు మంచి చదువు అందిస్తే భవిష్యత్‌లో ఉన్నత స్థానాల్లో ఉంటారు.



– మారెడ్డి మహేందర్‌రెడ్డి, భువనకృతి తండ్రి

సివిల్ సర్వీసెస్ సాధించడం లక్ష్యం



సిద్దిపేటకమాన్: నంగునూర్ మండలం గట్లమల్యాలకు చెందిన వంటెల జీవన్‌రెడ్డి, పద్మ దంపతులు సిద్దిపేట పట్టణంలో నివాసం ఉంటున్నారు. వీరికి ఒక్కరే కూతురు మనోజ్ఞరెడ్డి. ప్రస్తుతం ఆ పాప పట్టణంలోని ఓ ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలో 7వ తరగతి చదువుతుంది. కూతురు చదువు పూర్తి అయ్యాక పది మందికి ఉపయోగపడేలా ఏదైనా ఉద్యోగం చేయిస్తామని పాప తండ్రి తెలుపుతున్నాడు. తనకు సివిల్స్ అంటే ఇష్టమని, భవిష్యత్‌లో సివిల్ సర్వీసెస్ సాధించడమే తన లక్ష్యమని మనోజ్ఞరెడ్డి తెలిపారు.

– వంటెల మనోజ్ఞరెడ్డి, విద్యార్థిని, సిద్దిపేట

అమ్మాయి పుడితే కానుక

పెద్దశంకరంపేట(మెదక్): పుట్టిన ప్రతీ ఆడపిల్లకు మండల పరిధిలోని కమలాపూర్ మాజీ సర్పంచ్ కుంట్ల రాములు రూ. 2,116 అందజేస్తున్నారు. గతేడాది 26 మంది ఆడపిల్లలకు నగదు అందజేశారు. ఈసందర్భంగా రాములు మాట్లాడుతూ.. ప్రతీ సంవత్సరం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తమ గ్రామంలో పుట్టిన ఆడపిల్లలకు నగదును అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఆడపిల్లలను గౌరవించాలని, వారికి అన్నిరకాల హక్కులు కల్పించే విధంగా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. వారు ఉన్నత చదువులు చదివి ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు.



భూపాల్‌రెడ్డి చేతుల మీదుగా నగదు అందజేస్తున్న రాములు (ఫైల్)

సందేశం ఏదైనా దరువు వేయాల్సిందే

మద్దూరు(హుస్నాబాద్): గ్రామంలో ప్రజలకు ఎలాంటి సందేశం ఇవ్వాలన్నా చాటింపు(దరువు) వేస్తూ సమాచారం అందిస్తుంది. మద్దూరు మండలం వల్లంపట్లకు చెందిన మల్లిగారి ఎల్లవ్వ తన భర్త దాదాపు 20 ఏళ్ల క్రితం మృతి చెందాడు. ముగ్గురు పిల్లలను పోషించే క్రమంలో తన భర్త చూపించిన అడుగు జాడలో ముందుకు సాగుతోంది. గ్రామంలో సఫాయి పని చేస్తూనే చాటింపు వేస్తుంది. దీంతో తన ఇద్దరు కుమారులు, కుమార్తె వివాహం చేసింది. అయినప్పటికీ తన జీవనోపాధి అయిన చాటింపును మాత్రం వదలలేదు. ఎల్లవ్వను చూసిన అనేక మంది ప్రశంసిస్తున్నారు.



మరిన్ని కథనాలు 10వ పేజీలో

క్లుప్తంగా

సమాజంపై అవగాహన తప్పనిసరి

అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

సిద్దిపేటజోన్: ఉద్యోగం చేసే మహిళలు సమాజంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా టీఎన్జీవో భవన్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. ఉద్యోగం చేస్తున్న మహిళలు విధి నిర్వహణతో పాటు కుటుంబ బాధ్యతలు కూడా చూడాల్సి ఉంటుందన్నారు. సమాజానికి మంచి గుర్తింపు తెస్తున్న మహిళలు ఎందరో ఉన్నారన్నారు. వినోద పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి సరోజ, జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడు పరమేశ్వర్, ప్రధాన కార్యదర్శి విక్రమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి కీలకం



మాట్లాడుతున్న జడ్జి స్వాతిరెడ్డి

సిద్దిపేటజోన్: ఏరంగంలో స్థిరపడాలన్నా పదో తరగతి కీలకమని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి అన్నారు. గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా క్రాంతి పాఠశాలలో లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ప్రగతి సాధించాలన్నారు. విద్యార్థినులు క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత స్థానాలకు చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ శిరీష, పాఠశాల డైరెక్టర్ భగవాన్ తదితరులు పాల్గొన్నారు.


అక్రమ నిర్మాణాలపై విచారణ



అనుమతి పత్రాలను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో మల్లికార్జున్‌రెడ్డి

సిద్దిపేటఅర్బన్: సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామంలో అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని గ్రామానికి చెందిన శ్రీనివాస్, సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం డీఎల్‌పీవో గ్రామంలో విచారణ చేపట్టారు. డీఎల్‌పీవో మల్లికార్జున్ రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు అక్రమ నిర్మాణాలు, గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. విచారణకు వచ్చిన అధికారులకు ఇంటి నిర్మాణం చేస్తున్న ప్రవీణ్‌రెడ్డి తాము 2023 జనవరిలోనే అనుమతుల కోసం సుడా కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నామన్నారు. అనుమతులు రావడంలో జాప్యం జరిగిందని, ఈ మధ్యనే అనుమతుల వచ్చాయని అధికారులకు అనుమతి పత్రాలను అందజేశారు. సుడా కార్యాలయం నుంచి అందజేసిన అనుమతుల పత్రాలపై పూర్తి విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్టు అధికారులు తెలిపారు. గ్రామంలో 59 జీవో కింద అక్రమంగా క్రమబద్ధీకరించిన స్థలాలు, మెరుపుగుట్ట, దారగుట్ట మట్టి అక్రమ తవ్వకంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి విచారణ కాపీని తమకు అందించాలని ఫిర్యాదు దారుడు శ్రీనివాస్ కోరారు.









నమో నీలకంఠాయ..

శుక్రవారం శివాలయాలన్నీ హర హర మహాదేవ.. శంభో శంకర నామస్మరణతో మార్మోగనున్నాయి. మహాశివరాత్రి పురస్కరించుకొని ఆ నీలకంఠుడి దర్శనార్థం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆలయాలన్నీ సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. విద్యుత్‌దీపాలతో శోభిల్లుతున్నాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయాల కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. మహా శివరాత్రి సందర్భంగా ఆలయాల్లో ఏర్పాట్లు, విశిష్టతలపై ప్రత్యేక కథనం..

జాతరో.. జాతర

- ఏడుపాయలకు రూ.2 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- దుర్గమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించనున్న ఎమ్మెల్యే
- 630 మంది పోలీసులు.. 500 మంది వాలంటీర్లు

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జాతరను వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం రూ. 2 కోట్ల నిధులు విడుదల చేసింది. మహాశివరాత్రిని పురస్కరించుకొని శుక్రవారం ఉదయం వన దుర్గమ్మకు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించి జాతర ప్రారంభించనున్నారు. మూడు రోజుల పాటు జరిగే జాతరను జయప్రదం చేయడానికి 23 శాఖలకు చెందిన సుమారు 3 వేల మంది సిబ్బంది, అధికారులు ఏడుపాయల చేరుకున్నారు. సింగూరు నుంచి విడుదల చేసిన నీరు గురువారం సాయంత్రానికి ఘనపురం ప్రాజెక్టు చేరలేదు. భక్తుల దర్శనార్థం దుర్గమ్మ ముస్తాబైంది. రాజగోపురం వరకు భక్తుల నీడ కోసం షామియానాలు ఏర్పాటు చేశారు.ముందర మంజీర పాయల్లో భారీ శివుని విగ్రహం, అమ్మవారు, పోతరాజుల ప్రతిమలు ఏర్పాటు చేశారు. జాతర అంతా రంగు రంగుల విద్యుత్ దీపాలు, సీసీ కెమెరాలు, ఎల్ఇడీ స్క్రీన్‌లు, భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.జాతర కోసం ఆర్టీసీ 157 బస్సులు నడుపుతుంది. ఏడుపాయల్లో బస్‌స్టాప్ నుంచి జారతలోకి 8 ఉచిత బస్సులు నిరంతరం ప్రయాణికులను చేర వేస్తుంటాయి.

సేవల వివరాలు

ఏడుపాయల్లో వీఐపీ దర్శనం రూ.100, స్పెషల్ దర్శనం రూ.20, ఉచిత దర్శనం ఉంటుంది. కొబ్బరి కాయ, నెయ్యి దీపం, పసుపు కుంకుమ పాకెట్‌లు కలిసి రూ.50, లడ్డు రూ.20, పులిహోర రూ.10, కేశ ఖండనం రూ.50 , ఒడి బియ్యంకు రూ.50 చెల్లించాల్సి ఉంటుంది. ఎవరైనా ఎక్కువ వసూళ్లు చేస్తే ఈఓ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చు.

630 మంది పోలీసులతో..



జాతర కోసం సుమారు 630 మంది పోలీసులు భారీ బందో బస్తు నిర్వహిస్తారు.4 డీఎస్పీలు, 18 సీఐలు, 60 ఎస్సైలు, 140 ఏఎస్సైలు, 208 మంది పోలీసులు, 80 మంది మహిళా కానిస్టేబుళ్లు, 500 మంది వలంటీర్లు విధులు నిర్వహిస్తారు. వీరికి తోడు 23 శాఖలకు చెందిన సుమారు 2500 మంది సేవలు అందిస్తారు.

గుర్తుండిపోయేలా నిర్వహిస్తాం



భక్తులకు తీయని గుర్తుగా మిగిలిపోయేలా ఏడుపాయల జాతర నిర్వహిస్తాం. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ చొరవతో ప్రభుత్వం రూ.2కోట్లు విడుదల చేసింది. వారి సూచనల మేరకు జాతర ఏర్పాట్లు చేశాం. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో జాతర జయప్రదం చేయాలి.

– బాలాగౌడ్, చైర్మన్

24 గంటల సేవలందిస్తాం



భక్తులకు 24 గంటలపాటు సేవలందిస్తాం. ఎవరికి ఎలాంటి సమస్య ఏర్పడినా నేరుగా ఆలయ కార్యాలయానికి రావొచ్చు. మంజీర నది భాగోళికంగా ప్రమాదకరంగా ఉన్నందున షవర్‌ల కింద మాత్రమే స్నానాలు చేయాలి. 10 ప్రాథమిక చికిత్స కేంద్రాలతోపాటు ప్రధాన క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేశాం.

– మోహన్ రెడ్డి, ఈఓ, ఏడుపాయల



కేతకి ముస్తాబు

- భారీగా రానున్న భక్తులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ నిర్వాహకులు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ కేతకి సంగమేశ్వర ఆలయం మహాశివరాత్రి వేడుకలకు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యింది. ప్రతీ సంవత్సరం మహాశివరాత్రిని పురస్కరించుకొని కేతకి సంగమేశ్వర ఆలయంలో జాతర బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు అన్ని శాఖల అధికారులు చర్యలు చేపట్టారు. గతంలో కంటే ఈ సంవత్సరం భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశాలు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

నిరంతరం పర్యవేక్షణ

భక్తులకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో పోలీసులు కలిసి గట్టి బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. ఆలయ ఆవరణలో నిరంతరం పర్యవేక్షణ కొరకు ప్రత్యేకంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. శివదీక్ష భక్తులకు ఇరుముడి దీక్ష విరమణ కొరకు ప్రత్యేకంగా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. భక్తుల దర్శనాల కొరకు క్యూ లైన్లు, తాగునీరు, పోలీస్ కంట్రోల్ రూమ్, హెల్త్ క్యాంప్, బారి కేడ్స్, మొబైల్ టాయిలెట్లు తదితర ఏర్పాట్లు చేశారు. జాతరలో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు 3ఎంపీఓలు, 52 మంది పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడూ పారిశుధ్య పనులు పర్యవేక్షించనున్నారు.

విద్యుత్ దీపాల కాంతుల్లో..



కేతకి సంగమేశ్వర ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయ శిఖరం, రాజగోపురంతోపాటు పరిసరాలు, కమాన్ నుంచి ఆలయం వరకు ప్రత్యేకంగా ఎల్ఈడీ కమాన్లను ఏర్పాటు చేశారు. పురస్కరించుకొని ప్రజా ప్రతినిధులతో పాటు ప్రముఖులు, నాయకులు హాజరుకానున్నారు. ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటుభజనలు సంకీర్తన కార్యక్రమాలు ఉంటాయని ఆలయ అధికారులు వెల్లడించారు. జహీరాబాద్ నుంచి కేతకి ఆలయం వరకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నారు.

ఇబ్బందులు లేకుండా..



గతేడాది కంటే భక్తులు ఆలయానికి అధిక సంఖ్యలో వచ్చే అవకాశాలు ఉన్నాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. అందరూ అధికారులకు సహకరించాలి. స్వామివారి తీర్థప్రసాదాలు అందరికీ అందేలా చూస్తాం.

– శశిధర్, ఆలయ ఈఓ, ఝరాసంగం

పట్నం.. లగ్గం నేడే

సాక్షి, సిద్దిపేట: మల్లన్న పట్నమే.. కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణం. తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లోని ఒకటైన సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయం. భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతోంది. మహాశివరాత్రి సందర్భంగా యాదవ సంప్రదాయం ప్రకారం స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నారు. తెలుగురాష్ట్రాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలి రానున్నారు.

మూడు రకాల పట్నాలు..

పట్నాలు వేసేందుకు పసుపు, కుంకుమ, గులాబీ రంగు కుంకుమ, తంగేడు ఆకులతో చేసిన ఆకు పచ్చ పొడి, బియ్యంను వినియోగిస్తారు. భక్తులు బస చేసిన ప్రాంతాల్లో వేసేది చిలక పట్నం. ఆలయంలోని గంగిరేణి చెట్టు వద్ద వేసేది నజర్ పట్నం ఆలయం లోపల వేసేది ముఖ మండప పట్నం. మల్లన్నకు ప్రతి ఏడాది లేదా రెండు, మూడేళ్లకు ఒకసారి పట్నాలు వేసి భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. మహాశివరాత్రి పురస్కరించుకుని కొమురవెల్లిలోని తోట బావి దగ్గర పెద్ద పట్నం వేస్తారు. ఈ పెద్ద పట్నం 41 వరుసలతో దాదాపు 50 గజాల్లో వేస్తారు. జానపద రూపాల్లో ఒగ్గు పూజారులు కథను చెప్పుతూ పట్నం వేస్తారు.



పెద్ద పట్నం (ఫైల్)



మల్లికార్జున స్వామి మూలవిరాట్

కోటిలింగేశ్వర ఆలయం



క్యూలైన్ కోసం ప్రత్యేకంగా..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): శుక్రవారం మహాశివరాత్రి పండుగను నిర్వహించుకునేందుకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. గురువారం జిల్లా కేంద్రంలోని మార్కెట్‌లు పూలు, పండ్లు, తదితర పూజా సామగ్రి కొనుగోళ్లతో సందడిగా మారింది. అదే విధంగా జిల్లా కేంద్రంలోని శ్రీ ఉమాపార్థీవ కోటి లింగేశ్వర ఆలయం, శ్రీ శరబేశ్వర ఆలయం, శివాలయంతోపాటుగా అన్ని శైవ, వైష్ణవ ఆలయాలు మహాశివరాత్రి పర్వదినానికి ముస్తాబయ్యాయి. ఆలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఆలయ నిర్వహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గురువారం శ్రీ ఉమాపార్థీశ్వర కోటిలింగాల ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

మహిళలపై పెరిగిన కేసులు..



జహీరాబాద్: జిల్లాలో మహిళల అపహరణ, అవమానపరిచే సంఘటనలు, ఈవ్ టీజింగ్, హత్యలు, వరకట్న వేధింపుల కేసులు పెరిగాయి. గత రెండు మూడేళ్ల నుంచి ఈ కేసుల సంఖ్య పెరగడం మహిళలను ఆందోళనకు గురి చేస్తున్నాయి.

నేరాల వివరాలు

ముఖ్యమైన ఘటనలు	2021	2022	2023	పెరుగుదల/తగ్గుదల
వరకట్నం కోసం హత్యలు	00	00	00	0 శాతం
వరకట్న వేధింపుల వల్ల మరణం	07	10	05	- 50 శాతం
ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించడం	13	07	11	57 శాతం
రెండో పెళ్లి చేసుకోవడం	06	15	14	- 7 శాతం
భర్త వేధింపులు	129	189	181	- 4శాతం
స్త్రీల హత్యలు	18	08	10	25 శాతం
మానభంగం కేసులు	59	77	90	16 శాతం
అపహరణ కేసులు	16	18	25	38 శాతం
మహిళలను అవమాన పర్చడం	84	79	98	24 శాతం
ఈవ్ టీజింగ్ కేసులు	09	07	09	28 శాతం
షీటీం కౌన్సెలింగ్స్	23	68	48	- 29 శాతం
షీటీం కేసులు	01	23	09	- 61 శాతం

పాప పుట్టాలని దీక్ష చేశా



కూతురు శ్రామికతో దంపతులు

జహీరాబాద్ టౌన్: ఆడ పిల్లలు అంటే మాకు ఇష్టమని పట్టణానికి చెందిన పొద్దుటూరి శ్రీనివాస్‌గుప్త, స్వప్న తెలిపారు. కూతురు పుట్టాలని వేంకటేశ్వర స్వామి దీక్ష కూడా చేపట్టానిని శ్రీనివాస్ చెప్పారు. స్వామి కరుణించడంతో పాప పుట్టిందని, ఫుల్ హ్యాపీగా ఉందని పేర్కొన్నారు. పాపకు శ్రామికి అని పేరు పెట్టినట్లు, అమ్మాయి ఒక్కతే చాలనుకున్నామని చెప్పారు. కూతరు పుట్టడంతో లైఫ్ మొత్తం మారిపోయిందని, ఆమె పెరుగుదలతో మా ఎదుగుదల ప్రారంభమైందని చెప్పారు. ప్రస్తుతం శ్రామిక హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతుంది.

ఫ్యాషన్ డీజైనర్‌గా రాణిస్తున్న హర్షిణీ



కూతురు హర్షిణితో దంపతులు

దుబ్బాకటౌన్: పట్టణానికి చెందిన వడ్లకొండ మధు కాంట్రాక్టర్. ఆయన భార్య సుచరిత హబ్షీపూర్ హైస్కూల్‌లో హిందీ పండిట్. ఈ దంపతులు మొదట ఎవరూ పుట్టినా ఒక్కరే చాలనుకున్నారు. కూతరు పుట్టడంతో చాలా సంతోషించారు. పాపకు హర్షిణి అనే పేరు పెట్టారు. ప్రస్తుతం హర్షిణి నిఫ్ట్(నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ) పూర్తి చేసింది. ఇటీవలే హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ కంపెనీలో ఉద్యోగంలో చేరింది.

ఆడపిల్ల ఇంటికి ముద్దు



హర్షితతో తల్లిదండ్రులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఆడపిల్ల ఇంటికి ముద్దని రామచంద్రాపురం పట్టణంలోని వినాయకనగర్‌కు చెందిన వేణుగోపాల్‌రావు, సూజాత దంపతులు అభిప్రాయపడ్డారు. ఒక అమ్మాయి చాలనుకొని అల్లారుముద్దుగా పెంచాం. హర్షిత కోరిక మేరకు ఉన్నత విద్య కోసం కెనడాకు పంపించాం. అక్కడ ఉన్నత విద్య పూర్తి చేసి మంచి సంస్థలో ఉద్యోగం సాధించింది. మాకు చాలా సంతోషంగా ఉంది.

గ్రూప్‌-1 కావాలన్నదే లక్ష్యం

ముస్త్యాల ప్రత్యూష



ప్రత్యూషతో తల్లిదండ్రులు బాల్‌నర్సయ్య, అరుణ దంపతులు

చేర్యాల(సిద్దిపేట): పట్టణానికి చెందిన ముస్త్యాల బాల్ నర్సయ్య, అరుణ దంపతులకు 1988 డిసెంబర్‌లో వివాహం జరిగింది. వీరికి 1998 ఆగస్టు 7న ప్రత్యూష పాప పుట్టింది. బాల్ నర్సయ్య ఆర్ అండ్ బీ ఈఈగా రిటైర్ అయ్యారు. అరుణ గతంలో చేర్యాల గ్రామ సర్పంచ్‌గా సేవలు అందించారు. ఈ దంపతులు ఒక్క కూతురే చాలనుకున్నారు.

టాలెంట్‌ను బట్టి ప్రోత్సహిస్తాం..

దబ్బెట ఆంజనేయులు, సంతోష



సిద్దిపేటకమాన్: సిద్దిపేట రంగదాంపల్లికి చెందిన దబ్బెట ఆంజనేయులు, సంతోష దంపతులకు రిషిక పాప జన్మించింది. ఆంజనేయులు డీజిల్ మెకానిక్‌గా పనిచేస్తుండగా, తల్లి గృహిణి. రిషిక పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో మూడో తరగతి చదువుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో పాప అయినా.. బాబు అయినా ఒక్కటే అని.. మా పాపను పెద్దయ్యాక తన టాలెంట్‌ను బట్టి ప్రోత్సాహం అందిస్తామని ఆ దంపతులు చెబుతున్నారు. ఆడపిల్లలు ఉన్న తల్లిదండ్రులు అదృష్టవంతులు అని సంతోషం వ్యక్తం చేశారు.

మహిళల రక్షణకు భరోసా, షీటీంలు..

సిద్దిపేట జిల్లాలో మహిళలు, బాలికల భద్రత, రక్షణ కోసం కమిషనరేట్ పరిధిలో షీటీం, భరోసా సెంటర్, స్నేహిత మహిళ సపోర్టు సెంటర్, మహిళ పోలీసు స్టేషన్ ద్వారా సేవలు అందిస్తున్నారు. షీటీం ద్వారా ఆకతాయిలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నారు. పోకిరీలను పట్టుకుని కేసులు నమోదు చేస్తూ, కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు.

- పోలీసు కమిషనరేట్ పరిధిలో గతేడాది 2023లో మహిళలపై వేధింపులు, పోక్సో ఇతర మహిళలకు సంబంధించి 386 కేసులు నమోదు అయ్యాయి. అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా.. 28కేసులు కన్విక్షన్ అయినట్లు పోలీసు అధికారులు తెలిపారు.
- కమిషనరేట్ పరిధిలో 2024లో ఇప్పటి వరకు మహిళలకు సంబంధించి 39 కేసులు నమోదు కాగా, 36 కేసుల్లో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వీటిలో కేసు కన్విక్షన్ అయినట్లు చెప్పారు.
- జిల్లాలో షీటీం, భరోసా, స్నేహిత మహిళ సపోర్ట్ సెంటర్, మహిళ పోలీసు స్టేషన్, కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా పోలీసు అధికారులు, సిబ్బంది ప్రజలకు, బాలికలకు, మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గృహిణి.. మూడు ఉద్యోగాలు



కంగ్టి(నారాయణఖేడ్): ఒకేసారి మూడు ఉద్యోగాలు సాధించి సత్తా చాటింది కంగ్టి మండలంలోని కుగ్రామమైన బాన్సువాడకు చెందిన కోహిర్ పూజ. గృహిణిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే ఉద్యోగ కాంక్షతో పోటీ పరీక్షలకు ఇంటి వద్దే ప్రిపేర్ అయింది. ఓపెన్ కేటగిరిలో జూనియర్ లెక్చరర్, పీజీటీ, టీజీటీ ఉద్యోగాలు సాధించింది. భర్త జారా వెంకట్రాంరెడ్డి ఉద్యోగ రీత్యా కానిస్టేబుల్ కావడంతో ఆమె పోటీ పరీక్షల్లో రాణించేందుకు సహాయపడ్డాడు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పూజకు గ్రామస్తులు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

భర్తే మార్గదర్శి



టేక్మాల్(మెదక్): శ్రమ నీ ఆయుధం అయితే.. విజయం బానిస అవుతుందని ఓ మహనీయుడు చెప్పిన మాటలను నిజం చేసింది మండలంలోని దనూరకు చెందిన వీణ. గురుకుల పరీక్షల్లో సత్తా చాటి డిగ్రీ లెక్చరర్ (కామర్స్) ఉద్యోగం సాధించింది. నిరుపేద కుటుంబానికి చెందిన వీణకు భర్త అతినారం భిక్షపతి అన్ని రకాలుగా అండగా నిలిచారు. ప్రైవేట్ ఉద్యోగం చేస్తూనే కష్టపడి చదువుతూ ఉద్యోగం సాధించిన వీణను గ్రామస్తులతో పాటు మండల ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.